క్లుప్తంగా

డీజేలు వాడొద్దు

దొనకొండ: మండల పరిధిలోని గ్రామాల్లో శుభకార్యాలు, తిరునాళ్లు, ఇతర కార్యక్రమాలకు డీజేల వినియోగానికి అనుమతులు లేవని ఎస్ఐ టి.త్యాగరాజు స్పష్టం చేశారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ అనుమతులు పొందిన వారు మైకు లేదా సౌండ్ బాక్స్‌లు పరిమితి సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఏర్పాటు చేసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే అలాంటి వారిని గుర్తించి సంబంధిత పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దర్శి: స్థానిక 33/11 కేవీ పొదిలి రోడ్డు సబ్ స్టేషన్ పరిధిలో ఉండే 33 కేవీ నూతన లైన్ ఏర్పాటు చేస్తున్నందున పట్టణంలోని పొదిలి రోడ్డు, అద్దంకి రోడ్డులోని డిగ్రీ కళాశాల ఏరియా, కురిచేడు రోడ్డు, తూర్పు చౌటపాలెం రోడ్డు, టీచర్స్ కాలనీ, శివరాజనగర్ ఏరియాల్లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్‌శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తాళ్లూరు: మండలంలోని దోసకాయలపాడు సబ్ స్టేషన్ పరిధిలో ఆర్డీఎస్ పనులు చేపడుతున్న కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ రామకృష్ణారెడ్డి తెలిపారు. గ్రామస్తులు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పాఠశాలల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ అమీర్

దొనకొండ: మండలంలోని ఇండ్లచెరువు, రాగమక్కపల్లి, పోలేపల్లి, రామిరెడ్డిపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను మండల విద్యాధికారులు ఎస్.సాంబశివరావు, షేక్ అమీర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమాధానం రాబట్టుకున్నారు. నూతనంగా చేరిన ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందజేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులకు సూచనలు, సలహాలు అందజేశారు. సమస్యలుంటే తమకు తెలియజేయాలని ఎంఈఓలు సూచించారు.

మానవత సంస్థ సభ్యత్వాల నమోదు


సభ్యత్వం ఇస్తున్న మానవత ప్రతినిధులు

కురిచేడు: గడపగడపకు మానవత సంస్థ అనే ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆ సంస్థ ప్రతినిధులు మంగళవారం కురిచేడులో సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారు. కపురం శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా మాట్లడుతూ మానవత సంస్థ మహోన్నత విలువలు, ఆశయాలు కలిగిన సంస్థని, సమాజంలో ఎవరూ చేయలేని మహోన్నత కార్యక్రమాలు చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 141 కేంద్రాలు, 97 వేల మంది సభ్యులతో ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా సేవ చేస్తున్నారని, మానవత సంస్థకు అందరూ సహకరించాలని అభ్యర్థించారు. దర్శి మానవత సంస్థ ప్రతినిధులు దేవతి వరప్రసాద్, ధనిరెడ్డి వెంకటరెడ్డి, చీదెళ్ల బసవయ్య, రోశారావు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి


పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈవో

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈవో ఎండీ ఖాసిం అన్నారు. మంగళవారం మండలంలోని పిడికిటివానిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల సామర్థ్యాలు, నోట్ పుస్తకాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు తప్పని సరిగా ప్రభుత్వ నియమాలు అనుసరించి పనిచేయాలన్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారికి నాణ్యమైన విద్యనందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను కూడా రోజూ తనిఖీ చేయాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం రుచి, శుచిగా ఉండేలా తయారు చేసి విద్యార్థులకు వడ్డించాలన్నారు. సమయపాలన పాటిస్తూ విద్యార్థుల అభ్యున్నతికి బాటలు వేయాలన్నారు.

వివాహిత అదృశ్యం

యర్రగొండపాలెం: మండలంలోని భట్టువారిపల్లెలో వివాహిత అదృశ్యమైంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పి.చౌడయ్య తెలిపారు. ఆ వివాహిత ఈ నెల 12న బహిర్భూమికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, ఆమె గురించి వెతికినా ఫలితం లేకుండా పోయిందని భర్త కొప్పర్తి వెంకటరాజు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై చౌడయ్య పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రోడ్లపై మురుగుతో పారిశుధ్యం అధ్వానం


బద్వీడుచెర్లోపల్లి మెయిన్ రోడ్డుపై మురుగు


ఎస్సీ కాలనీ నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డుపై మురుగు

పెద్దారవీడు: మండలంలోని బద్వీడుచెర్లోపల్లిలో రహదారులపై మురుగుతో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ప్రధాన వీధుల్లో కాలువలు లేకపోవడంతో వర్షం నీరు ఇళ్లల్లోకి వస్తున్న పరిస్థితి నెలకొంది. రామాలయం వద్ద బజారులో ఇళ్ల ముందు ఎత్తుగా మట్టి తోలడంతో సిమెంటు రోడ్డుపై వర్షం నీరు నిల్వ ఉంటోంది. ఎస్సీ కాలనీ నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారిపై గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉంది. గుంతల్లో వర్షం నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టాలంటే బురద నీటిలో నానా అవస్థలు పడుతున్నారు. వర్షం కురిసిందంటే రోజుల తరబడి నీరు నిల్వ ఉంటోంది. వర్షం కురిస్తే చాలు రోడ్లపై వర్షం నీరు నిలబడి బురదమయంగా మారిపోతున్నాయి. దీంతో ప్రజలు దుర్వాసనకు భోజనం చేయలేక పోతున్నామని, రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు ద్విచక్ర వాహనాలపై, పాదాచారులు వెళ్లాలన్నా కష్టంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. రోడ్లపై నిలిచి ఉన్న వర్షం నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతుండటంతో ముక్కుమూసుకుని రాకపోకలు సాగిస్తున్నామని ప్రజలు చెబుతున్నారు. దీంతో పాటు నిల్వ ఉన్న మురుగు నీటిపై దోమలు సంచరిస్తున్నాయి. మురుగు నీటిలో ఉత్పత్తి అయిన దోమల బెడదతో స్థానికులు రాత్రి, పగలు అవస్థలు పడుతున్నారు. దోమలు కుట్టి ఎటువంటి రోగాల బారిన పడతామోనని భయాందోళన చెందుతున్నారు. ఇటీవల కాలంలో ప్రజలు జ్వరాలతో మంచాన పడ్డారు. గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించాలని పాలకులు, అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువలు నిర్మించి మురుగు నీరు ఊరి చివరకు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి


మహాసభలో మాట్లాడుతున్న రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు జయంతిబాబు

పెద్దారవీడు: పత్తి కొనుగోలు కేంద్రాన్ని మార్కాపురంలో వెంటనే ప్రారంభించాలని రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు జె.జయంతిబాబు డిమాండ్ చేశారు. మండలం పరిధిలోని హనుమాన్‌జంక్షన్ కుంటలో మండల రైతు సంఘ నాయకుడు గోపిదేశి మల్లయ్య అధ్యక్షతన రైతు సంఘ మహాసభ మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు పండించిన ఉత్పత్తుల కొనుగోలు, మార్కెట్ నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. రైతులు పండించిన ఉత్పత్తులను ప్రైవేటు వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదిలి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత కాలంగా పత్తి, మిరప, పొగాకు, శనగలు, కంది, మినుము తదితర పంటల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించక పోవడంతో రైతులు తీవ్ర అప్పుల ఊబిలోకి నెట్టబడ్డారని పేర్కొన్నారు. ఈ సంవత్సరం పత్తి పంటను పశ్చిమ ప్రకాశం జిల్లా అంతటా విరివిగా సాగు చేశారన్నారు. ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించకపోవడంతో పత్తి బయర్లు గ్రామాల్లో అతి చౌకగా కొనుగోలు చేయడం ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం పత్తి క్వింటా రూ.8110 ప్రకటించిందని, ఒక క్వింటా నేటికీ కొనుగోలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి మార్కాపురంలో పత్తి కొనుగోలు కేంద్రంగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. హనుమాన్‌జంక్షన్ కుంటలో ఆర్టీసీ బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం వెంటనే ప్రయాణికుల ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాలని, రైతులకు సబంధించిన భూములు ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించాలని, తీగలేరు కాలువపై విరివిగా చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని, అనేక మంది పేదలు వలసలు వచ్చి నివాసం ఉంటున్నారని, అర్హులైన పేదలకు నివాస గృహాలు మంజూరు చేయాలని తీర్మానాలు మహాసభలో ఆమోదించారు. మండల కన్వీనర్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో జిల్లా నాయకులు దగ్గుపాటి సోమయ్య, సీనియర్ నాయకులు గాలి వెంకటరామిరెడ్డి, మండల రైతు సంఘ కార్యదర్శి దుగ్గెంపుడి తిరుపతిరెడ్డి, నాయకులు గంగిరెడ్డి రాజశేఖరరెడ్డి మాట్లాడారు.

సైన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలి


కంభం : వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కంభం: విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలని ఎంఈఓ అబ్దుల్ సత్తార్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి వాల్‌పోస్టర్లను ఎంఈఓ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జన విజ్ఞాన వేదిక మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వరికుంట్ల వెంకటేశ్వర్లు, రమణారెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 8, 9, 10వ తరగతి విద్యార్థులు ఈనెల 18వ తేదీన పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొనే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. నవంబర్ 1న మండల స్థాయి, 23న జిల్లా స్థాయి, డిసెంబర్ 12,13,14వ తేదీల్లో రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయబ్ రసూల్, మస్తాన్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి పాఠశాలల స్థాయిలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాలపై మంగళవారం మర్రిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు పర్యవేక్షణలో సైన్స్ టీచర్స్ మండ్ల రామాంజనేయులు, ప్రతిమ చెకుముకి సంబరాల నిర్వహణ, విద్యార్థులకు నిర్వహించబోయే ప్రతిభా పరీక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులతో కలిసి చెకుముకి సంబరాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మర్రిపాలెంలో చెకుముకి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీచర్లు, విద్యార్థులు

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి


నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పుల్లలచెరువు: మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ యువ నాయకుడు యాపర్తి వీరగంగయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. వీరగంగయ్య తండ్రి చెంచయ్య పుల్లలచెరువు మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడిగా పనిచేశారు. వీరగంగయ్య మృతి వార్త తెలిసిన వెంటనే మండల పార్టీ కన్వీనర్ డి.వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షుడు ఎల్.రాములు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, చాపలమడుగు సర్పంచ్ టి.సత్యనారాయణరెడ్డి, జిల్లా అర్గనైజింగ్ సెక్రటరీ కె.రఘు, నాయకులు రమణారెడ్డి, దినేష్ యాదవ్, కాశయ్య, ఖాసింవలి, గంగరాజులు మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కనిగిరిరూరల్: పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్కే నాయబ్ రసూల్ అన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్‌మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కందుకూరు రోడ్డు, ఆర్టీసీ డిపో ప్రాంతాల్లో కాలువలను పరిశుభ్రం చేయించారు. ఇంట్లో నుంచి వచ్చే చెత్త, చెదారాన్ని కాలువల్లో వేయకుండా మున్సిపల్ చెత్త రిక్షా లేదా, చెత్త కుండీల్లో వేయాలని తెలిపారు. కాలువల్లో మురికినీరు నిలిస్తే.. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ శానిటరీ సెక్రటరీలు ఉన్నారు.

అందని బిల్లు.. సర్పంచ్‌లు ఘొల్లు!

- పంచాయతీలకు బిల్లుల చెల్లింపులో పాలకుల నిర్లక్ష్యం
- నిధులు జమై నెలైనా స్పందించని అధికారులు
- ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ సర్పంచ్‌ల ప్రదక్షిణ


తర్లుపాడు ఎంపీడీఓ కార్యాలయం

తర్లుపాడు: కూటమి ప్రభుత్వంలో పంచాయతీల పాలన ఇప్పటికే గాడితప్పగా.. సర్పంచ్‌లకు అవమానాలు నిత్యకృత్యమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు గత నెలలో పంచాయతీ ఖాతాలకు జమ అయినప్పటికీ బిల్లులు చేసేందుకు అధికారులు ససేమిరా అంటున్నారు. ఇప్పటికే గ్రామ పంచాయితీల్లో లక్షల రూపాయలు వెచ్చించి సర్పంచ్‌లు పనులు చేశారు. దీంతో తమ బిల్లుల కోసం ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. వర్షాకాలం మొదలై అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలి గ్రామాల్లో ప్రజలు ఇప్పటికే నానా అవస్థలు పడుతున్నారు. గ్రీన్ అంబాసిడర్ల వేతనం, కరెంటు బిల్లులు, డీప్‌బోరు రిపేర్లు, పారిశుధ్య పనులు చేపట్టేందుకు సర్పంచ్‌లకు నిధుల సమస్య ఏర్పడింది. కాగా ఇప్పటికే ప్రభుత్వం పంచాయతీలకు లక్షల రూపాయల బకాయిలు పడింది. ఈ నేపథ్యంలో ఆర్థిక సంఘం నిధులు డ్రా చేసి వెంటనే బిల్లులు చేయాలని సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు.

వెంటనే బిల్లులు చెల్లించాలి

గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య పనులు చేపట్టేందుకు ఇబ్బందిగా ఉంది. వర్షాకాలం కావడంతో కాలువల్లో పూడికతీత, బ్లీచింగ్ చల్లేందుకు నిధులు లేవు. ఇప్పటికే లక్షల రూపాయలు పంచాయతీలో పనులకు ఖర్చు చేశాం. గ్రీన్ అంబాసిడర్లు, కరెంటు బిల్లులకు లక్షల రూపాయల్లో బకాయిలు పడ్డాం. ఆర్థిక సంఘం నిధులు డ్రా చేసుకునేందుకు అధికారులు సహకరించాలి.

– పెద్ద మస్తాన్, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు

నిర్లక్ష్యం తగదు

లక్షల రూపాయలు వెచ్చించి పంచాయతీల్లో పనులు చేపట్టాం. గత నెలలో పంచాయతీ ఖాతాలకు ఆర్థిక సంఘం నిధులు జమయ్యాయి. నిధులు డ్రా చేసుకునేందుకు మండల కార్యాలయానికి వస్తే అధికారులు అందుబాటులో ఉండటం లేదు. పంచాయతీల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు పనులు చేయాలంటూ ఒత్తిడి చేయడం వల్లే లక్షల రూపాయలు ఖర్చు చేశాం. వెంటనే బిల్లులు చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జాన్‌రత్నం, సర్పంచ్, తాడివారిపల్లి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న రవాణాశాఖ అధికారి నాగలక్ష్మి

కందుకూరు: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి టీవీ నాగలక్ష్మి సూచించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆటో డ్రైవర్లకు ఆమె అవగాహన సదస్సు నిర్వహించారు. ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తరువాత మాత్రమే వాహనాలు నడపాలని, ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. అలాగే మద్యం తాగి అధిక వేగంతో వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. ఆటోలను ఎక్కడపడితే అక్కడ నిలపడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడతున్నాయని, కేటాయించిన స్థలంలోనే ఆటోలను నిలుపుకోవాలన్నారు. మోటార్ వాహనాల తనిఖీ అధికారి జంగాల అనిల్ మాట్లాడుతూ రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఆటోలకు సంబంధించిన పత్రాలను దగ్గరే ఉంచుకోవాలని, రవాణాశాఖ అధికారులు అడిగినప్పుడు వాటిని చూపించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా నియమాలు పాటించడం అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అనే విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయాలి


కార్మికులకు కరపత్రాలు పంచుతున్న నాయకులు

కురిచేడు: దర్శిలో జరిగే సీఐటీయూ జిల్లా 13వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య కోరారు. మంగళవారం వారు కురిచేడు పంచాయతీ కార్మికులను కలిసి మాట్లాడారు. దర్శిలో నవంబర్ 7 నుంచి 9 వరకు మహాసభలు జరుగుతున్నాయని, సీఐటీయూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, నెలనెలా జీతాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. సీఐటీయూ మహాసభలకు దర్శి నియోజకవర్గంలోని ప్రజలంతా సహకరించి జయప్రదం చేయాలని కోరారు. మోదీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలు రద్దు చేస్తోందని, పని గంటలు పెంచుతున్నారని, ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపై మహాసభల్లో చర్చించి కార్యాచరణ ప్రకటిస్తారని స్పష్టం చేశారు. పంచాయతీ యూనియన్ నాయకులు కమ్మిలి అశోక్‌కుమార్, బెంజిమన్, నాసరయ్య, సాల్మన్, లక్ష్మయ్య, పిచ్చమ్మ, ఏసమ్మ, గంటి కుమారి పాల్గొన్నారు.

ఘనంగా బౌద్ధమత స్వీకారోత్సవం


పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

దర్శి: మండలంలోని తూర్పువీరాయపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 70వ బౌద్ధమత స్వీకారోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉపాధ్యాయులు ఎట్టా వెంకటేశ్వర్లు అధ్యక్షతన అంబేడ్కర్‌కు 9వ తరగతి విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఐపీఎస్ అధికారి మోకా సత్తిబాబు సమకూర్చిన 'అంబేడ్కర్ బౌద్ధదీక్ష-నైతికత సమానత' అనే వ్యాస పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయుడు అట్లూరి రామారావు మాట్లాడుతూ నైతికత సమానత సామాజిక న్యాయం కలిగిన బౌద్ధ మతం ప్రపంచ విజ్ఞాన మేధావి స్వీకరించిన రోజన్నారు. దేశంలో ప్రతి మతానికి వెనుక ఒక కులం ఉంటుందని, అలాంటి కులం చాటు మతాలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ద్వేషించారని, కులం పునాదులపై దేశం నిర్మాణం జరిగిందని, ఆనాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐదున్నర లక్షల మంది అనుచరులతో ఏర్పడిన బౌద్ధమత స్వీకార సభలో ఉద్ఘాటించారన్నారు. సర్వకులాల సమ్మతి అయిన మతమే మానవ మతమని అంబేడ్కర్ చాటి చెప్పారన్నారు. గ్రామస్తులు డోలు నానీ, బోండాల కోటేశ్వరావు, తోరటి కృపయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మత్తులో మునుగుతున్న యాత్రికులు


కుప్పగా పోసిన ఖాళీ మద్యం సీసాలు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని శ్రీశైలం రహదారి అటవీ ప్రాంతంలో కొందరు యాత్రికులు మత్తులో తూగుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదని నిషేధాజ్ఞలు అమలులో ఉన్నా పచ్చదనంతో అహ్లాదాన్ని పంచుతున్న ఈ రహదారిలో కొందరు యాత్రికులు చెట్ల నీడన మద్యం తాగడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం రహదారిలోని పలు ప్రాంతాల్లో సేకరించిన మద్యం బాటిళ్లను అటవీ శాఖ సిబ్బంది గణపతి చెక్‌పోస్టు వద్ద పెద్ద కుప్పగా పడేశారు. అటవీ ప్రాంతంలో మద్యం తాగే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

భక్తుల సొమ్ముతో ఆలయాలు నిర్మిస్తే నష్టమేంటి?


మాట్లాడుతున్న కృష్ణారావు

మార్కాపురం: భక్తుల సొమ్ముతో హిందూ దేవాలయాలు నిర్మిస్తే తప్పేమిటని పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను మార్కాపురం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు ప్రశ్నించారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీటీడీ నిధులతో దళితవాడల్లో దేవాలయాలు నిర్మిస్తుంటే.. ఆ సొమ్మును సేవలకు ఉపయోగించండని షర్మిల చెప్పడం సబబు కాదన్నారు. రాష్ట్రంలో కేవలం హిందూ దేవాలయాల నుంచి వచ్చే సొమ్మును మాత్రమే నూతన ఆలయాల నిర్మాణానికి వినియోగిస్తున్నారని, పేదలకు చేయవలసిన సహాయం ప్రభుత్వం చేస్తుందని చెప్పారు. అంతగా సేవ చేయాలని అనిపిస్తే పేదలకు మీ దగ్గర ఉన్న సొమ్ముతో చేసుకోవాలని సూచించారు. సమావేశంలో బీజేపీ నాయకులు కె.శ్రీకాంత్, సుబ్బారావు, బాషా, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కాట్రగుంటలో నిండిన పెద్దమ్మ కుంట

నిండు కుండలా పెద్దమ్మ కుంట


పేరారెడ్డిపల్లి వద్ద తాటిమాను వాగు ఉధృతి

కొనకనమిట్ల: వాతావరణ ప్రభావంతో కొనకనమిట్ల మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులుగా ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. కాట్రగుంటలో పెద్దమ్మ కుంటకు నీరు చేరడంతో నిండు కుండలా మారింది. పేరారెడ్డిపల్లి సమీపంలోని తాటిమాను వాగు, పెద్దవాగు పొంగి పొర్లాయి. ఈ నీరంతా తువ్వపాడు చెరువుకు చేరడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.